క్లుప్తంగా

రంజాన్ సుఖ సంతోషాలు నింపాలి


అన్నా రాంబాబు


జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: రంజాన్ పండగ అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు తేవాలని ఆకాంక్షిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీ ఐఐసీ మాజీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు అల్లాహ్ బోధనలు ఆచరించాలని, తోటి వారిపై ప్రేమ, దయ చూపాలని, దాన గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

కంభంవాసికి అంబేడ్కర్ సేవా పతకం


సేవా పతకాన్ని అందుకుంటున్న అబ్రహాం

కంభం: ఉగాది పండగను పురస్కరించుకుని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి అంబేడ్కర్ సేవా పతకాలు అందించారు. ఆదివారం కొండపి మండలం తూర్పునాయుడుపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంభం పట్టణానికి చెందిన మాలమహానాడు జిల్లా కార్యదర్శి కల్వకూరి అబ్రహాంకు సేవా పథకాన్ని అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సెంటర్‌లో గల వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు నంద్యాల శ్రీనివాసులుయాదవ్ మాట్లాడుతూ.. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రజలకు వేసవిలో దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు బాలనరసింహులు, చల్లా రమేష్, గురవయ్య, బాలగురవయ్య, పోల్ రాజు, వెంకటేశ్వర్లు, బి.గోపాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా గోతులు.. ప్రయాణానికి ఇక్కట్లు

కొమరోలు:

మండలంలోని ఒట్టివేపమానుపల్లె గ్రామానికి వెళ్లే రహదారి అడుగడుగునా గోతులమయంగా మారింది. కడప–అనంతపురం రాష్ట్రీయ రహదారి నుంచి ఒట్టివేపమానుపల్లె వెళ్లే రహదారి దాదాపు 1.50 కిలోమీటర్ల దూరం ఉంటుంది. గ్రామస్తులు పనుల నిమిత్తం కొమరోలుకు రావాలన్నా, ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా ఈ గోతుల రహదారే దిక్కు. ద్విచక్ర వాహనాలపై ఈ రోడ్డులో ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దాల క్రితం వేసిన తారు రోడ్డు గుంతలమయంగా మారిందని, అధికారులు స్పందించి నూతన రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉషస్సుల ఉగాది.. నవ్యతకు నాంది

క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలికి విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గత ఏడాది వ్యవసాయంలో ఎదురైన ఒడిదొడుకులు.. ఈ ఏడాది ఎదురవకూడదని కాంక్షిస్తూ రైతులు తమ ఇష్టదైవాలకు పూజలు చేశారు. మహిళలు షడ్రుచులతో పచ్చడి తయారు చేసి అందిరికీ పంచి పెట్టారు. రైతులు తమ సమీపంలోని బ్రాహ్మణుల నివాసాలు, ఆలయాలకు వెళ్లి పంచాంగం విన్నారు. పలు గ్రామాల్లో రైతులు ఎడ్లను పూజించి ఏరువాక సాగారు.

ఊరూవాడా ఉగాది సంబరాలు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు


కొనకనమిట్ల : చినమనగుండంలో బొల్లావుల ఉత్సవం

మార్కాపురం టౌన్: ఉగాదిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, వెంకటేశ్వరస్వామి, అమ్మవారిశాల ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ అమ్మవారిని త్రిశక్తి స్వరూపిణిగా అలంకరించారు. ఉగాది వేడుకల్లో చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు. అలాగే ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

సత్సంగ సమితి ఆధ్వర్యంలో..

మార్కాపురం: షిర్డీ సాయి సత్సంగ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న సాయి బాబా మందిరంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం పేదలకు గొడుగు, పాదరక్షలు, వస్త్ర దానం చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాబా బోధనలు ఆచరించాలని మందిర వ్యవస్థాపకుడు ఆర్.రామచంద్రరావు భక్తులకు సూచించారు.

కాటం రాజుస్వామికి పూజలు

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండంలో కాటంరాజు, గంగాభవాని మాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులాలకు అతీతంగా పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని కాటంరాజుకు నైవేద్యం సమర్పించి భక్తిని చాటుకున్నారు. సాయంత్రం కుంకుమ బండ్లుకట్టి బొల్లావులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించి, పాడిపంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. అలాగే మండలంలోని గొట్లగట్టు కొండపై కొలువైన వేనూతల కాటంరాజుకు ఆదివారం సాయంత్రం పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించి కొండపైకి చేరుకుని నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి అన్నసంతర్పణ చేశారు.

తులసీ దళాల అలంకారంలో గోవిందుడు

పొదిలి: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ఉభయదాతలు వరికుంట్ల అనిల్ కుమార్, సురేఖ దంపతులు, మేడా నరసింహారావు, రమాదేవి దంపతులు తులసి మాలలతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఉగాది పచ్చడి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, వెలిశెట్టి నారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.


పొదిలి : వెంకటేశ్వరస్వామివారికి తులసి మాలలతో పూజలు చేస్తున్న ఉభయదాతలు

అంకాలమ్మ అమ్మవారికి పల్లకి సేవ

కంభాలపాడులోని బిట్స్ విద్యా సంస్థల ఆవరణలో అంకాల పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం పల్లకి సేవ నిర్వహించారు. ముందుగా బెల్లంకొండ శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలతోపాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఉగాది పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో వేదపండితులు పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది వేయాల్సిన పంటలు, సాగు చేయాల్సిన సమయం, మంచి రోజులు, పేరు బలం తదితర అంశాలను వివరించారు. రైతులు తమ ఎడ్లను, వ్యవసాయ పనిముట్లను శుభ్రం చేసి వ్యవసాయ పనులకు నాంది పలికారు.

ఘనంగా పోలేరమ్మ గ్రామోత్సవం

బేస్తవారిపేట: స్థానిక శివాలయం, లలితాంబిక దేవి, ఆంజనేయస్వామి, రాములవారి ఆలయం, త్రిలోక పుణ్యక్షేత్రంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బేస్తవారిపేటలో పోలేరమ్మ ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం కళశాలతో గ్రామోత్సవం, 108 బిందెలతో అమ్మవారికి అభిషేకం చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలోని ప్రజలు ఉగాది పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టాభిరామస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అర్చకులు పంచాంగ పఠనం చేశారు.

‘విశ్వావసు’లో అందరి జీవితాల్లో వెలుగు


చెన్నకేశవ స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

మార్కాపురం: విశ్వావసు ఉగాది నామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు తెస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, సాయిబాబా మందిర వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ బజారులోని సాయిబాబా మందిరంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిబాబా చూపిన మార్గంలో నడచిన వారికి కష్టాలు ఉండవని, తోటి వారికి సాయం చేయాలని తెలిపారు. బాబా ఆశీస్సులు, దాతల సహకారంతో రోజూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అర్చకులు రవిశర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన మార్కాపురం సీఐ సుబ్బారావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ, డాక్టర్ చప్పల్లి కనక దుర్గ, కె.కృష్ణమూర్తి, డాక్టర్ రాహుల్, సీహెచ్ రజనీకుమార్, పీవీ కృష్ణారావు, ఆర్‌కేజే నరసింహం, కె.రామకృష్ణ, పురాణం సుబ్రహ్మణ్యం, చిత్తారి రంగనాయకులు, ఎంవీ సుబ్బారావు, నాగమల్లికార్జున్, గుంటక సుబ్బారెడ్డి, నారాయణం తులసి, డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి, ఐ.వీరారావు తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో సాయి మందిరం ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, సహాయ కార్యదర్శి కరీం బాషా, సభ్యులు జి.కృష్ణమోహన్, నాగేశ్వరరావు, విజయ్, రామారావు, మధు, సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

త్రైతసిద్ధాంత ప్రబోద సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది క్యాలెండర్‌ను ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణ ఆవిష్కరించారు. సమితి అధ్యక్షుడు టి.ఎడుకొండలు, సభ్యులు చెన్నకేశవులు, బాలరంగయ్య, వీరాంజనేయులు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురం : సాయి మందిరంలో సీఐని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చెన్నకేశవస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం

మార్కాపురం టౌన్: ఉగాది సందర్భంగా స్థానిక లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకులు ఆదివారం పంచాగ పఠనం చేశారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాదిలో అందరికీ మంచి చేకూరాలని, ఈ ఏడాది వర్షాలు బాగా కురవాలని, ప్రజలు పాడి పంటలతో ఆనందంగా జీవించాలని ప్రధాన అర్చకుడు అప్పనాచార్యులు ఆకాంక్షించారు. అమ్మవారిశాలలో అర్చకుడు జొన్నబొట్ల రాము పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, సూరె సుబ్బారావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి


మార్కాపురం : ప్రత్యేక అలంకారంలో అల్లూరి పోలేరమ్మ తల్లి


పొదిలి : అంకాలమ్మ అమ్మవారికి పల్లకి సేవ


మార్కాపురం : పేదలకు గొడుగులు, దుస్తులు అందిస్తున్న సాయి సత్సంగ సమితి సభ్యులు

మాజీ ఎమ్మెల్యే కేపీకి వైఎస్సార్ సీపీ నేతల కృతజ్ఞతలు


మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఆ పార్టీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవులు పొందిన నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పదవులు వచ్చేందుకు కృషి చేసినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ జనరల్ సెక్రటరీ, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఆవుల శ్రీధర్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు మల్లెల శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎంపీటీసీ కుంపటి సురేష్, నాయకులు బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి ఉన్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని నాయకులకు కేపీ సూచించారు.

పాస్టర్ మృతికి కారకులను శిక్షించాలి

● క్రైస్తవ సంఘాల శాంతియుత ర్యాలీ

కంభం:

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నివాళులర్పిస్తూ ఆదివారం సాయంత్రం కంభం మండల ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏబీఎం చర్చి వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి కందులాపురం కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. పాస్టర్ మృతికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి సతీష్, షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు, కొత్తపల్లి విజయ్, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్, నేదరపల్లి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

వసంత నవరాత్రులు ప్రారంభం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

త్రిపురాంతకం: స్థానిక బాల త్రిపుర సుందరి దేవి ఆలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉగాది పండుగ నుంచి శ్రీరామనవమి వరకు జరిగే ఈ మహోత్సవాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈసందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహోత్సవాలను ఆలయ ధర్మకర్త, మండలి చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు.

వైభవంగా త్రిపురాంతకేశ్వరస్వామి గ్రామోత్సవాలు


త్రిపురాంతకేశ్వరస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం: ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం స్థానిక పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో జరిగిన ఊరేగింపులో భక్తులు అశేషంగా పాల్గొన్నారు. గ్రామంలో స్వామి ఊరి ఊరేగింపు సందర్భంగా భక్తులు అడుగు అడుగున నీళ్ల పోసి తమ భక్తిని చాటుకున్నారు. గ్రామ కూడళ్లలో పందిళ్లు వేసి ప్రత్యేక పూజలు చేశారు.